

అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ జకియా సుల్తానా

మధురానగర్ కాలనీలో ఫుట్‌పాత్, రహదారి ఆక్రమణల తొలగింపు

వెంగళరావునగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీలో నాలా రహదారికి ఇరువైపులా, అంతర్గత రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను భారీ పోలీస్ బందోబస్తు మధ్య జీహెచ్ఎంసీ సర్కిల్-19 టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది తొలగించారు. కొంతకాలంగా రహదారి, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ఇబ్బందులు పడుతున్నామని, కొంతమంది ఇంటి యజమానులు తమ ఇంటి ముందు ఉన్న ఫుట్‌పాత్‌లను రోజు వారీగా అద్దెకు ఇచ్చుకుంటున్నారని స్థానికుల ఆరోపణలు, సంక్షేమ సమితి ప్రతినిధులు ప్రజావాణిలో పలుమార్లు చేసిన ఫిర్యాదుల మేరకు ఎట్టకేలకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు స్పందించారు. గురువారం ఎక్స్‌కవేటర్‌తో మధురానగర్ డి-బ్లాక్ పార్కు నుంచి ఏ-బ్లాక్‌లోని మోర్ సూపర్ మార్కెట్ వరకు నాలా రహదారికి ఇరువైపులా ఆక్రమణలు, తాత్కాలిక నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ జకియా సుల్తానా, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ ప్రసీద హెచ్చరించారు. నిబంధనల ప్రకారమే తాము ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా, తమవే ఎందుకు తొలగిస్తున్నారని, కాలనీలోని అన్ని ఆక్రమణలను తొలగించాలని పలు దుకాణాల నిర్వాహకులు డిమాండ్ చేశారు. మిగతా వాటిపై ఎందుకు ప్రేమ చూపుతున్నారని వారు అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

ప్రభుత్వ స్థలం ట్రస్టుకు రిజిస్ట్రేషన్

షెడ్డు నిర్మాణం చేపడుతుండగా అడ్డుకున్న స్థానికులు



వివాదాస్పద స్థలంలో చేపట్టిన షెడ్డు నిర్మాణ పనులు

ఖైరతాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు అది ఖైరతాబాద్ ఓల్డ్ సీబీబీ క్వార్టర్స్‌కు చెందిన ప్రజల ఆస్తి. అక్కడ ప్రభుత్వ బోరింగ్, కుళాయి, అప్పట్లో డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్‌కు అనుసంధానం చేసిన గ్యాస్ పైప్‌లైన్‌లు ఉండేవి. వాటి తాలూకు ఆనవాళ్లు, గ్యాస్ స్తంభం ఇప్పటికీ అలాగే ఉన్న 40 గజాల విలువైన స్థలంలో, దాని పక్కనే ఉన్న ఓ ట్రస్టుకు చెందిన వారు అక్కడ షెడ్డు నిర్మాణం చేపడుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఆ స్థలాన్ని తాము కొనుగోలు చేశామని సదరు ట్రస్టు ప్రతినిధులు చెప్పడంతో అందరూ అవాక్కయ్యారు. 100 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ కాలనీలో ప్రతీ ఒక్కరి ఆస్తిగా భావించిన స్థలాన్ని హౌసింగ్‌బోర్డు ఇతరులకు ఎలాంటి సమాచారం లేకుండా అమ్మడం పలు అనుమానాలకు తావిస్తోందని, ఈ విషయమై చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయంతోపాటు జలమండలి ఎండీకి వినతి పత్రాలు అందజేశారు. రెండు సంవత్సరాల క్రితం ఇక్కడ ఉన్న బోరింగ్ చేతిపంపును సదరు ట్రస్టు వారే ఇతరులతో దొంగిలింపజేశారని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ప్రభుత్వ నల్లాను సైతం నీరు రాకుండా చేశారని స్థానికులు రాజు, రంజిత్, శ్యామ్, అశోక్ తదితరులు ఆరోపిస్తున్నారు. కాగా, ఈ స్థలాన్ని తాము హౌసింగ్‌బోర్డు నుంచి రుసుము చెల్లించి కొనుగోలు చేశామని, బోరింగ్, నల్లాల చోరీలో తమ ప్రమేయం ఏమాత్రం లేదని ట్రస్టు నిర్వాహకుడు ఉత్తమ్‌కుమార్ జైన్ తెలిపాడు. కాలనీకి చెందిన కొందరు పనులు నిలిపివేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. ఇక్కడ ఉన్న గ్యాస్ పైపు గతంలో సెప్టిక్ ట్యాంక్‌లు ఉన్న సమయంలోనివని, అవి ప్రస్తుతం పని చేయడంలేదని తెలిపారు. కాగా, ఖైరతాబాద్‌లో అత్యంత ఖరీదైన కాలనీగా గుర్తింపు పొంది 50 లక్షలకు పైగా విలువ చేసే ఈ స్థల వివాదంపై కాలనీ మొత్తం ఓ వైపు, ట్రస్టు ప్రతినిధులు ఓ వైపు గొడవకు దిగుతున్నారు. ఖైరతాబాద్‌లో ఎక్కడ చూసినా ఈ విషయమై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగారు.

భార్యకు విడాకులు ఇవ్వు.. లేదా రూ.కోటి పరిహారం చెల్లించు

- బెదిరింపులకు దిగిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

బంజారాహిల్స్, మే 15 (ఆంధ్రజ్యోతి): 'నీ భార్యకు విడాకులు ఇవ్వు నేను ఏలుకుంటా.. లేదంటే రూ.కోటి నష్టపరిహారం చెల్లించు..' రెండూ కాదంటే అభ్యంతకరమైన చిత్రాలు సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరింపులకు దిగుతున్న ఓ వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో నివాముండే ఓ హోటల్ వ్యాపారికి భార్య, ముగ్గురు పిల్లలు. యేడాది క్రితం అతడి భార్య మహ్మద్ ఇష్తికార్ అహ్మద్‌తో కొంతకాలం కలిసి తిరిగిందని, తన తప్పు తెలుసుకొని భర్త వద్దకు వచ్చేసిందని పోలీసులు తెలిపారు. అప్పటి నుంచి ఇష్తికార్ అహ్మద్ ఆమెను పలు విధాలుగా వేధించడం మొదలుపెట్టాడని, భర్తకు ఫోన్ చేసి అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలు ఉన్నాయని, వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరించాడని పోలీసులు తెలిపారు. అసలు నీకు ఏం కావాలి అంటూ భర్త అడగడంతో ఈనెల 14న బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని నీలోఫర్ కేఫ్ వద్దకు రావాలని కోరాడని, అక్కడకు వెళ్లాక ఇష్తికార్ మరో వ్యక్తితో వచ్చి తన వద్ద వీడియోలు ఉన్నాయంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడాడని పోలీసులు తెలిపారు. భార్యకు విడాకులు ఇచ్చి తనకు వదిలేయాలని లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించగా, ముగ్గురు పిల్లలున్నారు అర్థం చేసుకోవాలని భర్త బతిమిలాడాడని పోలీసులు తెలిపారు. రూ.కోటి నష్టపరిహారం కింద ఇస్తే వీడియోలు, ఫొటోలు డిలీట్ చేస్తానని చెప్పగా, బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫి ర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం.. వ్యక్తికి తీవ్ర గాయాలు

అమీర్‌పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): అతివేగం.. అజాగ్రత్తగా దూసుకొచ్చిన డీసీఎం అదుపు తప్పి బైక్‌ను ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి బాలాజీనగర్‌కు చెందిన బాబురావు(53) బైక్‌పై అమీర్‌పేటకు బయలుదేరాడు. సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రి వద్దకు రాగానే వెనక నుంచి అతివేగంగా దూసుకొచ్చిన డీసీఎం బైక్ ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బాబురావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాబురావు కుమారుడు ప్రభుదాస్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈటలపై అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం ముదిరాజ్

పంజాగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ సామాజికవర్గం ముద్దుబిడ్డ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ డిమాండ్ చేసింది. ఈటలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గుర్రాల మల్లేశం ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.అశోక్ ముదిరాజ్, యూత్ అధ్యక్షుడు పండుగ బాలుతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదహారు నెలలు గడుస్తున్నా తమ సామాజికవర్గానికి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్ర జనాభాలో 50 లక్షలకు పైగా ఉన్నా, తమకు అన్నిరంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. సమావేశంలో మహాసభ నాయకులు ఎస్.రాజ్‌కుమార్ ముదిరాజ్, పి.లక్ష్మణ్ ముదిరాజ్, చొప్పరి సోమయ్య ముదిరాజ్, జి.తిరుపతి, పి.మొగిలి, రజనీకాంత్, సదయ్య, ప్రశాం త్, సురేష్ పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ వర్సిటీ ఎన్నికలు

రాజేంద్రనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘం ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయి. పోటీలో ఉన్న వారు హోరాహోరీగా నెల రోజులు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుర్తింపు సంఘానికి శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని 12 కేంద్రాల్లో 695 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న పోలింగ్‌కు వర్సిటీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

తుమ్మిడిహెట్టి నిర్మాణం చేపట్టాలి

- కాళేశ్వరం బ్యారేజీలను అవినీతి స్మారకంగా వదిలేయాలి
- మేడిగడ్డ పునరుద్ధరణ/మరమ్మతులు దండగే
- తెలంగాణ జలసాధన సమితి రౌండ్‌టేబుల్ తీర్మానం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

పంజాగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీలను అవినీతి స్మారకంగా వదిలేయాలని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు/పునరుద్ధరణకు పెట్టే ప్రతీ పైసా దండగేనని, వీటి స్థానంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని తెలంగాణ జల సాధన సమితి డిమాండ్ చేసింది. గురువారం సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రొఫెసర్ వినాయకొరెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ ప్రాణహితను రీ డిజైనింగ్ చేసి, గ్రావిటీతో నీళ్లిచ్చే ప్రాజెక్ట్ కాదని, 100 కిలోమీటర్ల దిగువన కాళేశ్వరం బ్యారేజీలు కట్టడం ఉద్దేశపూర్వకమైన కుంభకోణమని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఇసుకపై కట్టారని, రాక్ బెడ్‌మీద కడితే నిలబడేవని, ఇసుక పునాదులపై కట్టే బ్యారేజీల్లో 2 టీఎంసీల కంటే ఎక్కువ నీరు నిల్వ చేయడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదని నీటిపారుదలరంగ నిపుణులు పి.జి.శాస్త్రి అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చినా కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడిన వారిని ఎందుకు శిక్షించడం లేదని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రశ్నించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు డబ్బు వృథా చేయకుండా తుమ్మిడిహెట్టిని నిర్మించాలని ఎమ్మెల్సీ కోదండరాం డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజల ఆస్తులకు ధర్మకర్తగా లేడని, దోపిడీదారుగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రాణహిత పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.వి.ప్రతాప్, మాజీ ఇంజనీర్ విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి



అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పంజాగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గత ప్రభుత్వ హయాంలో సింగరేణిలో జరిగిన అన్ని కుంభకోణాలపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు చేయించాలని, సింగరేణి సీఎండీగా సీనియర్ ఐఏఎస్‌ని నియమించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గొల్లపల్లి దయానంద్‌రావు, తెలంగాణ సాధన సమరయోధుల వేదిక అధ్యక్షుడు గంట సత్యనారాయణరెడ్డి, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, కిరణ్ పోకల, తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణిలో మెడికల్ బోర్డు, ఉద్యోగ నియామకాలు, డీజిల్, కోల్, తదితర కుంభకోణాలు జరిగాయని, వాటిపైన ప్రస్తుత ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన అధికారులలో కొందరు ప్రస్తుతం కొనసాగుతూ కోవర్టులుగా మారి సంస్థను రక్షించాల్సింది పోయి భక్షిస్తున్నారని ఆరోపించారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో పాలన కుంటుపడిందన్నారు. రిక్రూట్‌మెంట్‌లో ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేశారని, ఎస్సీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేసి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎన్.సాయి కుమార్, సుధాకర్, రాజేశ్వర్ యాదవ్, జంగన్నగౌడ్, డాక్టర్ కళ్యాణ్, అంజలి, సిద్దమ్మ పాల్గొన్నారు.

1500 డ్వాక్రా గ్రూపుల ఏర్పాటే లక్ష్యం

బోరబండ, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక స్వావలంభన కల్పించేందుకు జీహెచ్ఎంసీ సర్కిల్-19 పరిధిలో 1500 డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సర్కిల్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు తెలిపారు. బ్యాంక్ ఖాతాల కోసం డ్వాక్రా మహిళలు బ్యాంక్‌ల వద్ద అవస్థ పడకుండా, బ్యాంక్ సిబ్బందినే మహిళల వద్దకు పిలిపించి ఖాతాలు తెరిచేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా, వారికి ప్రభుత్వ పథకాలు అందేందుకు డ్వాక్రా గ్రూపులలో సభ్యులుగా చేర్పిస్తున్నట్లు చెప్పారు. అంతేగాకుండా ప్రభుత్వ సూచనల మేరకు ట్రాన్స్‌జెండర్లతో కూడా ప్రత్యేకంగా డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేయిస్తామని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉం డగా, ఒక్కో గ్రూపునకు రూ.2వేలు, సభ్యులకు రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.12వేలు చెల్లించడం ప్రాథమిక దశలో కష్టమవుతుందని, గతంలో మాదిరిగా బ్యాంక్‌ల్లో జీరో అకౌంట్లు తెరిపిస్తే తమకు సౌకర్యంగా ఉంటుందని పలువురు మహిళలు చెప్పారు.



డ్వాక్రా మహిళల ఖాతాల దరఖాస్తులను పరిశీలిస్తున్న బ్యాంక్ సిబ్బంది

సాయివర్ధన్ విజయం యువతకు స్ఫూర్తిదాయకం

అడ్డగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కార్ఖానా ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల జవాజి సాయివర్ధన్ మంగళవారం బీహార్‌లోని ఔరంగాబాద్ ఖేలో ఇండియా శిబిరంలో భారతదేశ వ్యాపితంగా ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 89 కేజీల విభాగంలో 275 కేజీల బరువు ఎత్తి స్వర్ణ పతకాన్ని సాధించి ప్రతిభను చాటాడు. సాయివర్ధన్ కోచ్ విజయ్ రేయిలా నేతృత్వంలో వెయిట్‌లిఫ్టర్ తన తండ్రి జవాజి శివకుమార్‌తో గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి అద్భుత ప్రదర్శన ఇచ్చిన సాయివర్ధన్ కంటోన్మెంట్ నియోజక వర్గానికి చెందిన వ్యక్తి కావడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో దేశం తరపున ప్రపంచ వేదికలపై తన సత్తా చాటి మరిన్ని పతకాలను సాధించాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంకి రవీందర్, తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కాలేరు శ్రీనివాస్, ఇంటర్ నేషనల్ వెయిట్ లిఫ్టర్ రాజ్‌కుమార్‌లు ఉన్నారు.




ఉచిత హోమియోపతి వైద్యశిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ తదితరులు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బౌద్ధనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. గురువారం ప్రాంతీయ హోమియోపతి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం బౌద్ధనగర్ జీహెచ్‌ఎంసీ వార్డు ఆఫీస్‌లో ఏర్పాటుచేసిన ఉచిత హోమియోపతి వైద్యశిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైద్యశిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించుకున్న వారికి కార్పొరేటర్ ఉచితంగా హోమియోపతి మందులను అందజేశారు. యూసీడీ అరుణతో వైద్యులు పాల్గొన్నారు.

బెదిరిస్తున్నారా? ఫిర్యాదు చేయండి

- తుకారాంగేట్ సీఐ శ్రీకాంత్ రెడ్డి



అడ్డగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో ఇళ్లు కడుతున్న యజమానులను యూట్యూబ్ చానళ్ల పేరుతో కొందరు విలేకరులమంటూ బెదిరిస్తే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ప్రజలకు ధైర్యం చెప్పారు. ఈ విషయమై రెండు రోజుల క్రితం జై భీమ్ మాల మహాసంఘం ప్రతినిధులు తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇల్లు కట్టినా, బోరింగ్ వేసినా మీవద్దకు విలేకరులమంటూ వచ్చే వ్యక్తుల ఫోటోలు, వాయిస్ రికార్డింగ్ చేసి ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఎవరైనా సరే ఊపేక్షించేది లేదని ఎవరూ ఇలాంటి విషయాల్లో భయపడవద్దని ఆయన తెలిపారు.



తుకారాంగేట్‌లో సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

అడ్డగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సికింద్రాబాద్ జోన్ సీఐటీయూ నాయకులు ఆర్ మల్లేష్, గోపాల్‌లు పిలుపునిచ్చారు. తుకారాంగేట్ చౌరస్తాలో గురువారం సీఐటీయూ నాయకులు సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెరపైకి తెచ్చిందని, లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని కేంద్రానికి సూచించారు. హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాకు ప్రతిఒక్కరూ హజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దేవయ్య, రవి, దానయ్య, మల్లేష్, రమేష్, రాజయ్య మన్యం పాల్గొన్నారు.



మాతృ దినోత్సవం సందర్భంగా గురువారం అడ్డగుట్టలో యువరత్నాల టీం బృందం ఘనంగా వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు సువర్ణ, రమాదేవి, ప్రవీణ్ కుమార్, సందీప్, మైత్రి, గీత, రాకేష్, ఓమర్, పియూస్‌రాగీలు పాల్గొన్నారు. - (అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి)

తెలంగాణ మహిళలకు అవమానం : మాజీ ఎమ్మెల్యే సునీత

రాంగోపాల్ పేట్, మే 15 (ఆంధ్రజ్యోతి) : విశ్వసుందరి పోటీల నేపథ్యంలో వరంగల్ రామప్ప దేవాలయానికి వచ్చిన విశ్వసుందరుల పాదాలను తెలంగాణ మహిళలతో కడిగించి తెలంగాణ మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. గురువారం బుద్ధభవన్‌లోని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ... తెలంగాణ ఆడపడుచులను అవమానించేవిధంగా చేసిన చర్యలను ఖండించారు. ప్రభుత్వానికి పేరు రావాలంటే వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ మహిళా మంత్రులతో చేత విశ్వసుందరుల కాళ్ళను కడిగించాల్సిందని, ఇలాంటి చర్యల మూలంగా తెలంగాణ ప్రతిష్ఠ దెబ్బతింటుందని అన్నారు. విశ్వసుందరి పోటీదారులు రామప్ప దేవాలయం వద్ద బతుకమ్మను అగౌరవపరిచే విధంగా కాళ్లకు పాదరక్షలు ధరించి బతుకమ్మ ఆడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ మహిళల పట్ల చిన్నచూపు, వివక్ష వైఖరి ప్రదర్శించడం సరికాదన్నారు.

ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో

చిల్లర సమస్య



ఉజ్జయినీ మహాకాళి ఆలయం

ప్రసాదాల కొనుగోలులో భక్తుల ఇబ్బందులు

నిస్సహాయత వ్యక్తం చేస్తున్న సిబ్బంది

సికింద్రాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): రెండు వందల సంవత్సరాలకుపైగా విశిష్ట చరిత్ర కలిగిన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి భక్తులకు చిల్లర సమస్య ఎదురవుతోంది. అమ్మవారిపై అపారమైన నమ్మకంతో మొక్కులు తీర్చుకునేందుకు తరలివస్తున్న భక్తులకు చిల్లర సమస్య చికాకు పెడుతోంది. ఆర్జిత సేవలు, ప్రసాదాల కొనుగోలు చేసేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్న భక్తులకు చిల్లర సమస్య నిరాశకు గురి చేస్తోంది. తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర అనగానే ఠక్కున గుర్తుకు వచ్చేది.. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి ఆలయం. జంటనగరాలతోపాటు జిల్లాలు, రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ ముఖ్యంగా మంగళ, శుక్ర, ఆదివారం రోజుల్లో విశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు శుభం చేకూర్చాలంటూ మొక్కులు తీర్చుకుంటారు. కంకుమార్చన, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ తదితర సేవలు జరిపించి, అమ్మవారి కరుణా కటాక్షాలు పొందాలని తపన పడుతుంటారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం తీసుకోవాలని ఆరాట పడుతుంటారు.



ఆలయంలోని హుండీ వద్ద ఏర్పాటు చేసిన యూపీఐ స్కానర్

అయితే .. ఆలయంలో టిక్కెట్ కౌంటర్లలో తరచూ చిల్లర సమస్య తలెత్తుతుండడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. వివిధ రకాల సేవలు, ప్రసాదాల కోసం టిక్కెట్లు కొనుగోలు చేసే భక్తులకు 'చిల్లర లేదు' అంటూ సిబ్బంది చెబుతుండడం షరామామూలుగా మారింది. ఐదు మందికో, పది మందికో అయితే ఫర్వాలేదు గాని..... ప్రతి ఒక్కరూ వంద, రెండు వందలు, ఐదు వందల రూపాయిల నోట్లు తీసుకువస్తే తామేం చేయాలంటూ సిబ్బంది నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. కాగా చిల్లర దొరకని కారణంగా చాలా మంది భక్తులు ప్రసాదాలు కొనుగోలు చేయకుండానే వెనుతిరగడం నిత్యకృత్యమైంది.

యూపీఐ స్కానర్లు ఏర్పాటు చేయాలి

ఆలయానికి విచ్చేసే భక్తులు కానుకల రూపంలో డబ్బులు సమర్పించేందుకు ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో యూపీఐ స్కానర్లు ఉన్నాయి. అయితే వివిధ రకాల సేవలు, ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు టిక్కెట్లు ఇచ్చే కౌంటర్లలో మాత్రం లేకపోవడం గమనార్హం. ఈ కౌంటర్లలో కూడా గూగుల్ పే, ఫోన్ పే, స్కానర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తులు పేర్కొంటున్నారు. ఉజ్జయినీ మహాకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి సత్వరమే ఈ విషయమై చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని, తద్వారా భక్తులకు సదుపాయం కల్పించడంతో పాటు ఆలయ రాబడి పెంపునకు కూడా దోహదపడుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న జక్కుల మహేశ్వర్ రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బోయినపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన బోయినపల్లి కంటోన్మెంట్ 1వ వార్డు నేతాజీనగర్‌కు చెందిన నామాల నరేష్ గౌడ్‌కు మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద, మధ్యతరగతి వర్గాలకు ఆర్థిక చేయూతనందించడంతో ఎంతో మేలు చేస్తుందన్నారు. బోయినపల్లిలో వైద్య సేవల కోసం సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ యాదవ్, విజయ్, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు పెద్దపీట : ఎమ్మెల్యే

తిరుమలగిరి మే 15(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఎనిమిదో వార్డు, బొల్లారం, కళాసిగూడలో ఎస్‌డీఎఫ్ నిధులతో రూ.32 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో కలిసి ప్రారంభం చేశారు. నియోజకవర్గం పరిధిలో అన్ని ప్రాంతాలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు లాంటి సౌకర్యాలు, అవసరమైన ప్రదేశాల్లో సామాజిక భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే వయోవృద్ధులు సేద తీరడానికి పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇస్తుందని, కాలనీలు/బస్తీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ప్రత్యేక నిధులను తీసుకువస్తున్నానని అందులో నుంచి రూ.9 లక్షలతో గన్‌రాక్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయబోతున్నామని పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిధులు కేటాయించిన ఎమ్మెల్యేను ఆ ప్రాంతవాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నాగసేని సరిత, మురళీ ముదిరాజ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని, నవీన్, గోకుల్, రాజ్ కుమార్, కంటోన్మెంటు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఖదీరవన్, మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, వార్డు 8 బీజేపీ అధ్యక్షురాలు ప్రవీణ్ కుమార్ పింజర, బీజేపి సీనియర్ నాయకులు ధనంజయ చారి, జేవి నిర్సంగ్ రావు, జైనపల్లి శ్రీకాంత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద

యూనివర్సిటీల ఎంపికలో జాగ్రత్త అవసరం

- డాక్టర్ అమిత్ అగర్వాల్

రాంగోపాల్‌పేట్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్య కోసం యూనివర్సిటీలను ఎంపిక చేసుకునే సమయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు యూనివర్సిటీల పూర్తి వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని జీఎల్‌ఏ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ అగర్వాల్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ సర్దార్‌పటేల్ రోడ్డులోని యాత్రి నివాస్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాసంస్థల అధిపతులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాల క్రితం మథురాలో ఏర్పాటైన తమ యూనివర్సిటీ లాభాపేక్ష లేకుండా అత్యున్నత ప్రమాణాలు కలిగిన నిపుణులైన అధ్యాపకులతో బోధన చేయిస్తున్నామన్నారు. వర్సిటీలో చదివే విద్యార్థులకు చివరి సెమిస్టర్ ఐఐటీల్లో చదువుకోవడం, వారితో పాటు పరీక్షలు రాసే అవకాశం లభిస్తుందన్నారు. అలాగే పెయిడ్ ఇంటర్న్‌షిప్, ప్రపంచంలోనే పేరొందిన ప్రఖ్యాత 1800 కంపెనీలతో ఒప్పందం చేసుకుని తమ విద్యార్థులకు అత్యుత్తమ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే మెరిట్ విద్యార్థులకు 100 శాతం స్కాలర్‌షిప్ అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సౌత్ జోనల్ హెడ్ లక్ష్మీకాంత్ పాటూరి, పలు విద్యాసంస్థల అధిపతులు పాల్గొన్నారు.

సాకర్ గోల్‌కీపర్స్ శిక్షణ శిబిరం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సౌత్ క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీ ఫుట్‌బాల్ గోల్ కీపర్స్ నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ శిబిరం నిర్వహిస్తుంది. ఈనెల 26, 27వ తేదీల్లో రెండ్రోజులు పాటు సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. 11 ఏళ్లు పైబడిన బాల బాలికల ఈ శిబిరానికి హాజరు కావచ్చు. భారత అండర్-17 ఫుట్‌బాల్ జట్టు సహాయ కోచ్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల వారు ఈనెల 21వ తేదీ లోపు తమ పేర్లను ఈ నంబర్లకు 8655004448, 7989100602 ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చు.




ధామస్‌కి పురస్కారం అందజేస్తున్న మంత్రి సీతక్క

మతం పేరిట రాజకీయాలు వద్దు : సీతక్క

హరిహరకళాభవన్, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమాజసేవలో పాల్గొంటే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్రమంత్రి సీతక్క పేర్కొన్నారు. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో బుధవారం యువత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క ప్రసంగిస్తూ దేశంలో అన్ని మతాలకు సమాన గౌరవం వుందని, మత సంస్థలు మతానికే పరిమితం కాకుండా ప్రజల ఆరోగ్యం, విద్య పట్ల శ్రద్ధ చూపాలని తెలిపారు. సమాజసేవలో చురుగ్గా పాలుపంచుకుంటూ పేదలకు అన్నదానం, వితంతువులకి కుట్టు శిక్షణలతో స్వయంఉపాధి, అనాథ పిల్లలకు ఉచితవిద్య అందజేస్తున్న బిషప్ డాక్టర్. ధామస్‌కి అమెరికా యూనివర్సిటీ అందజేసిన శాంతిదూత పురస్కారాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో షీబా ధామస్, అశోక్, డేవిడ్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో పుట్టిన రోజు వేడుకలు

బేగంపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ పుట్టిన రోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో పార్టీ నాయకులు నిర్వహించారు. మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ ఆలయాల్లో జరిగిన పూజల్లో నీలిమ, పవన్ ఖేరా దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం గాంధీ ఆసుపత్రిలో పలువురికి వీల్ చైర్లు పంపిణీ చేశారు. సనత్‌నగర్‌లో మహిళా కాంగ్రెస్ నేత ఖమర్ హమీద్ ఆధ్వర్యంలో పలువురికి చీరలు పంపిణీ చేశారు. నీలమ మాట్లాడుతూ పుట్టిన రోజును సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు.



నగరంలో విదేశీ మహిళలతో వ్యభిచార దందా

- ముఠా ఆటకట్టించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- ముగ్గురు నిందితులు, ఇద్దరు మహిళా సప్లయర్స్ అరెస్టు
- ఇద్దరు బంగ్లాదేశ్ యువతులను రక్షించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ/ అడ్డగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి అక్రమంగా నగరానికి వలస వచ్చి.. సికింద్రాబాద్ పరిధిలో గుట్టుగా వ్యభిచార దందా నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. ముగ్గురు నిందితులను, ఇద్దరు మహిళా సప్లయర్స్‌ను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. వారి చెర నుంచి ఇద్దరు బంగ్లాదేశీ యువతులను రక్షించారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ గోపాలపురం పరిధిలో గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఆకస్మిక దాడి చేసిన పోలీసులు పశ్చిమబెంగాల్‌కు చెందిన బిమల్‌సేన్ అలియాస్ సుబ్రతా, బంగ్లాదేశ్‌కు చెందిన సకిల్ హుస్సేన్ అలియాస్ ముల్లా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన కస్టమర్ ఎస్ఏ నజీర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి అదుపులో ఉన్న బంగ్లాదేశ్‌కు చెందిన ఇద్దరు యువతులను రక్షించి హోమ్‌కు తరలించారు. వారితో పాటు.. ముఠాలో ఉన్న మరో ముగ్గురు బంగ్లాదేశ్ నిర్వాహకులు పరారీలో ఉన్నారు. బిమల్ సేన్ అలియాస్ సుబ్రతా కొంత కాలం క్రితం పశ్చిమబెంగాల్ నుంచి బతుకుదెరువుకోసం వచ్చి సికింద్రాబాద్‌లో ఉంటూ వ్యభిచార గృహాన్ని నడుపుతున్నాడు. ఇద్దరు మహిళా సప్లయర్స్ ద్వారా బంగ్లాదేశ్ నుంచి యువతులను అక్రమంగా ఇండియాకు రప్పించి పశ్చిమ బెంగాల్‌కు చెందిన మధ్యవర్తుల ద్వారా హైదరాబాద్‌కు దిగుమతి చేసుకుంటున్నాడు. బతుకుదెరువు చూపిస్తామని చెప్పి చీకటి దందాలోకి దింపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. గోపాలపురం పోలీసులు నిందితులను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అరెస్టు చేసిన అక్రమ వ్యభిచార ముఠా